
సాక్షి పల్నాడు

సోమవారం ♦ 11 ♦ నవంబర్ ♦ 2024



నిత్యాన్నదానానికి రూ.లక్ష విరాళం

విజయవాడ : దుర్గమ్మ సన్నిధిలో నిర్వహించే నిత్యాన్నదాన పథకానికి హైదరాబాద్‌కు చెందిన భక్తులు సట్లూరి కావ్య, రాఘవేంద్ర రూ. లక్ష విరాళాన్ని అందజేశారు.



సాగర్ నీటిమట్టం

విజయపురిసౌత్: నాగార్జునసాగర్ జలాశయ నీటిమట్టం ఆదివారం 587.20 అడుగుల వద్ద ఉంది. జలాశయం నుంచి కుడికాలువకు 10,120 క్యూసెక్కులు వదిలారు.



మోపిదేవిలో కార్తిక దీపోత్సవం

మోపిదేవి: వల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామి గుడిలో ఆదివారం కార్తిక దీపోత్సవం నిర్వహించారు. తెల్లవారుజామునే భక్తులు పుణ్యస్నానాలు ఆచరించి దీపాలు వెలిగించారు.

న్యూస్‌రీల్

ఆరుగురు ఎస్‌ఐలకు అటాచ్‌మెంట్

నగరంపాలెం: జిల్లాలో వీఆర్‌లో ఉన్న ఆరుగురు ఎస్‌ఐలకు అటాచ్‌మెంట్ కింద పోస్టింగ్‌లు కల్పిస్తూ జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్ ఉత్తర్వులు జారీ చేశారు. ఎస్‌ఐలు ఎ.శివకృష్ణ రావుకు అరండల్‌పేట పీఎస్, బి.విజయకుమార్‌రెడ్డికి సోషల్ మీడియా, సైబర్ క్రైం సెల్, పి.రబ్బానీకి నగరంపాలెం పీఎస్, ఎ.శ్రీనివాసరెడ్డికి తూర్పు ట్రాఫిక్ పీఎస్, పి.అనిల్ కుమార్‌రెడ్డికి పశ్చిమ ట్రాఫిక్, ఎల్.రాములును సీసీఎస్‌కు బదలాయించారు. ఈ నెల 5న వీఆర్‌లో ఉన్న ముగ్గురు ఎస్‌ఐలకు పోస్టింగ్‌లు కల్పిస్తూ ఉత్తర్వులు వెలువడగా, మరలా వాటిని రద్దు చేశారు. అనంతరం కొత్తగా ఆరుగురు ఎస్‌ఐలకు అటాచ్‌మెంట్ కింద పోస్టింగ్‌లు కల్పించారు.

కార్తిక దీపోత్సవం




సత్తెనపల్లి: పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్ ఎదుట గల వాసవి కన్యకా పరమేశ్వరి అమ్మవారి గోశాలలో ఇస్కాన్ నరసరావుపేట ఆధ్వర్యంలో శ్రీ శ్రీ దామోదర కార్తిక దీపోత్సవం ఆదివారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. తొలుత గోమాత పూజ, అనంతరం శ్రీ శ్రీ దామోదర కార్తీక దీపోత్సవ వైభవంగా నిర్వహించారు. వైష్ణవ ప్రభు ప్రత్యేక ప్రవచనం చేశారు. భక్తులు తమ స్వహస్తాలతో దామోదరునికి హారతినిచ్చే సేవ చేపట్టారు. భక్తులకు ప్రసాద వితరణ చేశారు. భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై శ్రీ శ్రీ దామోదర మహద్భాగ్యం పొందారు. భక్తులకు ఎలాంటి ఆటంకం కలగకుండా ఇస్కాన్ భక్త బృందం ఏర్పాట్లను పర్యవేక్షించింది.

పోలీసుల తనిఖీలు

పట్నంబజార్: గుంటూరు వెస్ట్ సబ్ డివిజన్ పరిధిలోని వెస్ట్ ట్రాఫిక్ పోలీసులు ఆదివారం సాయంత్రం గుంటూరు నగరంలో స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. నిబంధనలకు విరుద్ధంగా స్నేక్ డ్రైవ్, రాష్ డ్రైవ్, సైలెన్సర్లు తీసివేసి తిరుగుతున్న వాహనదారులను పట్టుకున్నారు. వెస్ట్ ట్రాఫిక్ సీఐ సింగయ్య ఆధ్వర్యంలో మొత్తం నాలుగు బైకులు స్వాధీనం చేసుకుని జరిమానాలు విధించారు.

సాగునీటి సమాచారం



తాడేపల్లిరూరల్ (దుగ్గిరాల): కృష్ణా పశ్చిమ ప్రధాన కాలువకు సీతానగరం వద్ద ఆదివారం 6830 క్యూసెక్కులు విడుదల చేశారు. హైలెవల్ కాలువకు 316 క్యూసెక్కులు, బ్యాంక్ కెనాల్‌కు 1711 క్యూసెక్కులు, తూర్పు కెనాల్‌కు 682 క్యూసెక్కులు, పశ్చిమ కెనాల్‌కు 187 క్యూసెక్కులు, నిజాంపట్నం కాలువకు 440 క్యూసెక్కులు, కొమ్మమూరు కాలువకు 3060 క్యూసెక్కులు విడుదల చేశారు.

నేటి నుంచి భవానీ దీక్షలు

15 వరకు మండల దీక్షల స్వీకరణకు ఏర్పాట్లు



విజయవాడ : ఇంద్రకీలాద్రిపై కొలువై ఉన్న దుర్గమ్మ భవానీ దీక్షలు సోమవారం నుంచి ప్రారంభం కానున్నాయి. మండలం పాటు దీక్షలను ఆచరించే భక్తులు సోమవారం తెల్లవారుజాము నుంచి 15వ తేదీ వరకు దీక్షలను స్వీకరించనున్నారు. భక్తులు భవానీ దీక్షలను స్వీకరించేందుకు మహా మండపం ఆరో అంతస్తులో ఉత్సవ మూర్తి వద్ద, ఘాట్‌రోడ్డు ఆరంభంలోని కామధేను అమ్మవారి ఆలయం వద్ద దేవస్థానం ప్రత్యేక ఏర్పాట్లు చేస్తుంది. సోమవారం తెల్లవారుజామున భక్తులు పవిత్ర కృష్ణానదిలో పుణ్యస్నానాలు ఆచరించిన అనంతరం అమ్మవారి ఆలయంతో పాటు గురు భవానీల పీఠాల వద్ద దీక్షలను స్వీకరించ వచ్చునని ఆలయ వైదిక కమిటీ సభ్యులు రంగావఝ్జుల శ్రీనివాసశాస్త్రి చెప్పారు. భవానీ దీక్షల ప్రారంభాన్ని పురస్కరించుకుని సోమవారం ఉదయం అమ్మవారి ఉత్సవ మూర్తికి ప్రధాన ఆలయంలో పూజలు నిర్వహించిన అనంతరం మేళతాళాలు, మంగళవాయిద్యాల నడుమ మహా మండపం ఆరో అంతస్తు వరకు ఊరేగింపుగా తీసుకెళ్లతారు. ఆరో అంతస్తులో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన వేదికపై అమ్మవారు అధిష్ఠించి పూజలు, అఖండ జ్యోతి ప్రజ్వలన చేస్తారు. ప్రధాన అర్చకులు, గురుభవానీల చేతుల మీదుగా భక్తులకు దీక్షాధారణ నిర్వహిస్తారు.

కోటప్పకొండ కోలాహలం





అభిషేకాల్లో పాల్గొన్న భక్తులు, (ఇన్‌సెట్‌లో) త్రికోటేశ్వర స్వామి

నరసరావుపేట రూరల్: ప్రముఖ శైవక్షేత్రం కోటప్పకొండ ఆదివారం భక్తులతో కోలాహలంగా మారింది. పవిత్ర కార్తిక మాసం ఆదివారం సెలవు రోజు కావడంతో త్రికోటేశ్వర స్వామిని దర్శించుకునేందుకు భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. స్వామికి తెల్లవారుజామున పంచామృతాలు, విశేష ద్రవ్యాలతో మహాన్యాస పూర్వక రుద్రాభిషేకాలు, పుష్పాలంకరణ సేవలు నిర్వహించారు. అనంతరం భక్తులను స్వామి దర్శనానికి అనుమతించారు. అయ్యప్ప మాలధారులు తొలి అభిషేకాల్లో పాల్గొన్నారు. మహిళలు ఆలయంలోని రావిచెట్టు, మహా నందీశ్వరుడు వద్ద కార్తీక దీపాలు వెలిగించారు. ధ్యానశివుడు, నాగేంద్రుని పుట్ట వద్ద భక్తులు పూజలు నిర్వహించారు. అభిషేక మండపంలో నిర్వహించిన ప్రత్యేక అభిషేకాల్లో భక్తులు పాల్గొన్నారు. సోపాన మార్గంలో మెట్లపూజ చేస్తూ కొండపైకి చేరుకుని మొక్కులు తీర్చుకున్నారు. ఆలయ ఈఓ డి.చంద్రశేఖర్ ఏర్పాట్లను పర్యవేక్షించారు. నరసరావుపేట నుంచి ఆర్టీసీ ప్రత్యేక బస్సులను నడిపింది. రూరల్ ఎస్‌ఐ కిషోర్ ఆధ్వర్యంలో పోలీసులు బందోబస్తు నిర్వహించారు. ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా చర్యలు తీసుకున్నారు.



రావిచెట్టు వద్ద కార్తీక దీపాలు వెలిగిస్తున్న మహిళలు

అమరారామంలో భక్తుల సందడి



అమరేశ్వరాలయంలో కార్తీకదీపాలు వెలిగిస్తున్న భక్తులు



విశేషాలంకారంలో అమరేశ్వరుడు

అమరావతి: ప్రఖ్యాత శైవ క్షేత్రమైన అమరావతిలో ఆదివారం తెల్లవారు జామునుంచి భక్తుల సందడి నెలకొంది. పంచారామక్షేత్ర సందర్శకుల బస్సులతో అమరావతి మెయిన్‌రోడ్ నిండిపోయింది. తొలుత పవిత్ర కృష్ణానదిలో పుణ్యస్నానాలు చేసిన భక్తులు ఆలయంలోని ఉసిరి చెట్టు వద్ద దీపారాధనలతో శివకేశవులకు పూజలు చేశారు. భక్తులు అమరేశ్వరునికి అభిషేకాలు, బాలచాముండేశ్వరీ దేవికి కుంకుమార్చనలు నిర్వహించారు. ధ్యానబుద్ధ ప్రాజెక్టు, పాత, కొత్త మ్యూజియంలు, అమరేశ్వరాలయం, స్నానఘాట్‌లు విద్యార్థులు, భక్తులు, యాత్రికులతో కళకళలాడాయి. కార్తీకమాస సందర్భంగా జిల్లా నలుమూలల నుంచి వచ్చిన భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలుగకుండా దేవాలయ అధికారులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.



చరలింగాకారంలో ఉన్న అమరేశ్వరునికి అభిషేకాలు చేస్తున్న దృశ్యం



అమరేశ్వరాలయంలో కార్తీక దీపాలు వెలిగిస్తున్న భక్తులు

పొలిటికల్ బాస్‌ల కోసం పనిచేస్తున్న పోలీస్ బాస్

- మాకూ ఓ రోజు వస్తుంది.. ఏ ఒక్కరినీ వదలిపెట్టబోం
- మాజీ మంత్రి విడదల రజిని



పట్నంబజారు: ''పోలీసు బాస్... పొలిటికల్ బాస్‌ల కోసం పనిచేస్తున్నారు. తమ పరిధి దాటి పోలీసులు వ్యవహరిస్తున్న తీరు దారుణం. గుర్తుపెట్టుకోండి.. మాకూ ఒక రోజు వస్తుంది. కచ్చితంగా ఏ ఒక్కరినీ వదలిపెట్టబోమని'' మాజీ మంత్రి, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ చిలకలూరిపేట నియోజకవర్గ సమన్వయకర్త విడదల రజిని స్పష్టం చేశారు. శ్యామలానగర్‌లోని తన నివాసంలో ఆదివారం ఆమె విలేకరులతో మాట్లాడారు. దేశంలో ఎక్కడా లేని విధంగా చంద్రబాబు నీచ రాజకీయాలు చేస్తున్నారని మండిపడ్డారు. వైఎస్సార్ సీపీకి సంబంధించిన సోషల్ మీడియా యాక్టివిస్టులు, సానుభూతిపరులు, అభిమానులపై అక్రమ కేసులు పెట్టి వేధింపులకు గురిచేయటంపై ఆవేదన వ్యక్తం చేశారు. చిలకలూరిపేటకు చెందిన పెద్దిరెడ్డి సుధారాణి, ఆమె భర్త వెంకటరెడ్డిలను అక్రమంగా అరెస్ట్ చేశారన్నారు. సిరిసిల్ల నుంచి బలవంతంగా తీసుకొచ్చి చిలకలూరిపేట టౌన్ స్టేషన్‌లో అక్కడి సీఐ టార్చర్ చేయటంపై మండిపడ్డారు. న్యాయస్థానంలో ఆమె ఆవేదన వినేందుకు గంట సమయం కేటాయించారంటే.. పరిస్థితి అర్థం చేసుకోవచ్చన్నారు. వైఎస్సార్ సీపీ అధ్యక్షులు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, వారి కుటుంబసభ్యులు, తమపై సోషల్ మీడియా వేదికగా వ్యక్తిగత హననం చేస్తుంటే.. ఫిర్యాదులు చేసినా పట్టించుకోకపోవటం సిగ్గుచేటన్నారు. తాను స్వయంగా సాక్ష్యాధారాలతో ఫిర్యాదు చేసినా డీజీపీ, ఎస్పీ ఇంతవరకు స్పందించకపోవటంపై ప్రశ్నించారు. చట్టం మీకు ఒకలా.. మాకు ఒకలా ఉంటుందా? అని నిలదీశారు. డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ స్పష్టంగా లా అండ్ ఆర్డర్ రాష్ట్రంలో ఎలా ఉందో చెప్పిన విషయాన్ని గుర్తు చేశారు. బాధితులకు జగనన్న, తాము అండగా ఉంటామన్నారు.

తీరంలో ఆనందోత్సాహాలు



కార్తీక పౌర్ణమికి ముందు వచ్చిన ఆదివారం సెలవు రోజు కావడంతో పర్యాటకులు తీరానికి పోటెత్తారు. తెల్లవారుజామున 4 గంటలకే యాత్రికులు తీరానికి చేరుకొని సూర్య నమస్కారాలతో పుణ్యస్నానాలు ఆచరించారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు మహిళలు తీరంలో ప్రత్యేకపూజలు నిర్వహించారు.

– బాపట్లటౌన్

బియ్యం కయ్యం

- అధికారపార్టీలో అక్రమ బియ్యం లొల్లి
- ఇక్కుర్రులో 53 బస్తాల రేషన్ బియ్యం స్వాధీనం
- తమ వారికి ఇవ్వలేదని పట్టించిన ప్రజాప్రతినిధి వర్గం
- కేసు లేకుండా విడిపించాలంటూ టీడీపీ గ్రామ నేత వీరంగం
- పార్టీ కార్యాలయంలోనే ప్రజాప్రతినిధిపై ఆగ్రహం

సాక్షి నరసరావుపేట: అక్రమ రేషన్ బియ్యం వ్యాపారం అధికారపార్టీలో విభేదాలకు దారితీసింది. తమకు బియ్యాన్ని సరఫరా చేయని వారిపై ప్రజాప్రతినిధి వర్గం కక్షగట్టి అధికారులతో దాడులు చేయిస్తోంది. అయితే ప్రజాప్రతినిధి వర్గం ఇచ్చే ధర కన్నా బహిరంగ మార్కెట్లో అధిక రేటు వస్తుండటంతో డీలర్లు బయట వ్యాపారులకే బియ్యాన్ని విక్రయిస్తున్నారు. ఈ నేపథ్యంలో ఇక్కుర్రులో అక్రమ రేషన్ నిల్వలను పోలీసులు స్వాధీనం చేసుకోవడం ఓ టీడీపీ గ్రామ నాయకుడికి ఆగ్రహం తెప్పించింది. పట్టుకున్న రేషన్ బియ్యం వదిలేయకుంటే గ్రామంలో అడుగుపెట్టనివ్వబోమంటూ సదరు టీడీపీ నాయకుడు ప్రజాప్రతినిధికి అల్టిమేటం జారీ చేయడం హాట్ టాపిక్‌గా మారింది.

53 బస్తాల సీజ్

మండలంలోని ఇక్కుర్రు నుంచి నకరికల్లు తరలిస్తున్న రేషన్ బియ్యాన్ని ఆదివారం తెల్లవారు జామున రూరల్ ఎస్‌ఐ ప్రియాంక సిబ్బందితో వెళ్లి స్వాధీనం చేసుకున్నారు. మినీలారీలో ఉన్న 53 బస్తాల బియ్యాన్ని గుర్తించి సీజ్ చేశారు. రూరల్ పోలీసు స్టేషన్‌కు తరలించారు. లారీ డ్రైవర్‌ను అదుపులోకి తీసుకుని విచారణ చేస్తున్నారు.



పోలీసులు స్వాధీనం చేసుకున్న రేషన్ బియ్యం మినీ లారీ

బియ్యం విక్రయించలేదనే కక్ష

నియోజకవర్గంలో అక్రమ రేషన్ బియ్యం వ్యాపారం ప్రజాప్రతినిధి కనసన్నల్లోనే నడుస్తోంది. ఆయనకు ఆప్తుడిగా ఉన్న విద్యావేత్తకు ఈ వ్యాపార బాధ్యతలను ప్రజాప్రతినిధి అప్పగించారు. విద్యావేత్త చెప్పిన రేటుకే రేషన్ డీలర్లు బియ్యం విక్రయించాలి. కాదని ఎవరైనా వ్యవహరిస్తే వారిపై పోలీసులను, రెవెన్యూ యంత్రాగాన్ని ప్రయోగిస్తున్నారు. ఇక్కుర్రు గ్రామ రేషన్ డీలర్ నాలుగునెలల నుంచి విద్యావేత్త సూచించిన వారికి బియ్యాన్ని సరఫరా చేయడం లేదు. అధిక ధరకు మరో రేషన్ మాఫియాకు విక్రయిస్తున్నాడు. దీనిపై కక్షపెంచుకున్న ప్రజాప్రతినిధి వర్గం అతనిపై పోలీసులతో దాడులు చేయించిందన్న చర్చ పార్టీ వర్గాల్లో జరుగుతోంది.

ప్రజాప్రతినిధిపై చిందులు

గ్రామంలోని తన వర్గం రేషన్ డీలర్‌కు చెందిన బియ్యాన్ని పోలీసులు స్వాధీనం చేసుకోవడంపై టీడీపీ గ్రామ నాయకుడు ఆగ్రహం వ్యక్తం చేశాడు. టీడీపీ నియోజకవర్గ కార్యాలయానికి ఆదివారం వెళ్లిన అతను నేరుగా ప్రజాప్రతినిధిపై చిందులు తొక్కాడు. పోలీసులు స్వాధీనం చేసుకున్న బియ్యం కేసు లేకుండా విడిపించాలని కోరాడు. ఈ వ్యవహారంలో తాను జోక్యం చేసుకోనని ప్రజాప్రతినిధి తేల్చిచెప్పారు. అక్రమ బియ్యం వ్యాపారం ఎవరి ఆధ్వర్యంలో నడుస్తోందో అందరికీ తెలుసని, దీనిపై అధిష్టానం వద్ద తేల్చుకుంటామని ఆగ్రహంతో ఊగిపోయాడు. తనకు న్యాయం చేయనప్పుడు గ్రామంలోకి ఎలా వస్తారో చూస్తానని బెదిరింపులకు దిగాడు. తాను సీనియర్ నాయకుడినని, తన మాటే చెల్లుబాటు కాకుంటే చూస్తూ ఊరుకోబోమని, సమయం వచ్చినప్పుడు తగిన సమాధానం చెబుతానని ఆగ్రహం వ్యక్తం చేశాడు.

ఫుట్‌బాల్ టోర్నీ బాలుర విజేత గుంటూరు



ప్రథమ స్థానం సాధించి కప్పు అందుకుంటున్న గుంటూరు జిల్లా బాలుర జట్టు

- బాలికల విభాగం విజేత అనంతపురం
- రన్నర్లుగా విశాఖ, వైఎస్సార్ కడప
- బాలికల విభాగంలో గుంటూరుకు తృతీయ స్థానం

సత్తెనపల్లి: రాష్ట్రస్థాయి అండర్ –19 ఫుట్‌బాల్ క్రీడా పోటీల్లో బాలుర విభాగంలో గుంటూరు జిల్లా జట్టు, బాలికల విభాగంలో అనంతపురం జిల్లా జట్టు విజేతలుగా నిలిచాయి. స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ గుంటూరు, ప్రగతి జూనియర్ కళాశాల సత్తెనపల్లి ఆధ్వర్యంలో 68వ రాష్ట్ర స్థాయి అండర్–19 పోటీలు పల్నాడు జిల్లా సత్తెనపల్లిలో మూడు రోజులపాటు జరిగాయి. ఆదివారం ఫైనల్ పోటీలు జరిగాయి. బాలుర విభాగంలో ఫైనల్స్‌లోకి ప్రవేశించిన విశాఖ జిల్లా జట్టుపై గుంటూరు జిల్లా జయకేతనం ఎగురవేసింది. కర్నూలు జిల్లా తృతీయ స్థానం, విజయనగరం జిల్లా నాలుగో స్థానంలో నిలిచాయి. బాలికల విభాగంలో ఫైనల్స్‌లోకి ప్రవేశించిన వైఎస్సార్ కడప జిల్లా జట్టుపై అనంతపురం జిల్లా జట్టు విజేతగా నిలిచింది. గుంటూరు జిల్లా తృతీయ స్థానం, విశాఖపట్నం జిల్లా నాలుగోస్థానం దక్కించుకున్నాయి. విజేతలకు కప్పుతోపాటు రోలింగ్ షీల్డ్, నగదు బహుమతులను సత్తెనపల్లి ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ అందజేశారు. ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ మాట్లాడుతూ క్రీడాభివృద్ధికి కూటమి ప్రభుత్వం చిత్తశుద్ధితో కృషి చేస్తోందన్నారు. కార్యక్రమంలో మాజీ మున్సిపల్ చైర్మన్ యెల్లినేడి రామస్వామి, నాయకులు దరువూరి నాగేశ్వరరావు, ఆళ్ల అమరేశ్వరరావు, కంభాల వెంకటేశ్వరరావు, వక్కంటి అజయ్‌కుమార్, ప్రగతి విద్యాసంస్థల అధినేత డాక్టర్ మక్కెన అచ్చయ్య, ప్రిన్సిపల్ రాయపాటి శ్రీనివాసరావు, గుంటూరు జిల్లా స్కూల్ గేమ్స్ కార్యదర్శి జి.నరసింహారావు, సహాయ కార్యదర్శి సీహెచ్ పద్మాకర్, ఫిజికల్ డైరెక్టర్లు ఎస్ సుధాకర్‌రెడ్డి, దాసరి కోటేశ్వరరావు, నిర్వాహకులు పి.శివరామకృష్ణ పీడీలు లాకు పిచ్చయ్య, అనిల్ దత్త నాయక్ పాల్గొన్నారు.



తృతీయ స్థానం సాధించి బహుమతి అందుకుంటున్న గుంటూరు జిల్లా బాలికల జట్టు

అటవీ అమర వీరుల త్యాగాలను వృథా కానివ్వం

- వారి కుటుంబాలకు అండగా ప్రభుత్వం
- ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్

గుంటూరు ఎడ్యుకేషన్: అటవీ సంపద దోచుకునే వారిని ధైర్యంగా ఎదుర్కొని ప్రాణాలర్పించిన అటవీ అధికారులు, ఉద్యోగుల త్యాగాలను వృథా కానివ్వబోమని ఉప ముఖ్యమంత్రి, పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, అటవీ, పర్యావరణ శాఖల మంత్రి కొణిదెల పవన్ కల్యాణ్ అన్నారు. గుంటూరులోని జిల్లా కలెక్టర్ బంగ్లారోడ్డులో ఉన్న అరణ్య భవన్‌లో ఆదివారం జరిగిన అటవీ అమరవీరుల సంస్మరణ సభలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. అమరవీరుల స్తూపం వద్ద నివాళులర్పించిన అనంతరం జరిగిన సభలో మాట్లాడుతూ.. అటవీ సంపద పరిరక్షణలో ఒక ఐఎఫ్‌ఎస్ అధికారితోపాటు 23 మంది సిబ్బంది తమ అమూల్యమైన ప్రాణాలు కోల్పోయారని గుర్తుచేశారు. విధి నిర్వహణలో అశువులు బాసిన వారి కుటుంబాలకు ప్రభుత్వం అండగా ఉంటుందన్నారు. అమరవీరుల త్యాగాలను స్ఫూర్తిగా తీసుకుని, ప్రకృతి సంపదను భవిష్యత్తు తరాలకు అందించేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేద్దామని అన్నారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ చెప్పినట్లు మనది వసుధైక కుటుంబమని, భూమిపై మనతోపాటు జీవిస్తున్న జంతువులు, చెట్లు, చేమలు, పశు పక్ష్యాదులను రక్షించే బాధ్యత మనందరిపై ఉందన్నారు. సిబ్బంది, నిధుల కొరత ఉన్నా అధిగమించి అటవీ శాఖను బలోపేతం చేస్తామని తెలిపారు. అధికారులు నిబద్ధతతో పనిచేస్తున్నారని అన్నారు. రాజకీయ నాయకులు వారి ముందరి కాళ్లకు బంధాలు వేయకుండా వాళ్ల పని వాళ్లను చేసుకోనిస్తే సరిపోతుందన్నారు.



మాట్లాడుతున్న ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్

దాతల సహకారంతో సంజీవని స్కీమ్‌కు నిధులు

అటవీ సంపద సంరక్షణలో ఇండియన్ ఫారెస్ట్ ఆఫీసర్, కీర్తిచక్ర అవార్డు గ్రహీత దివంగత పందిళ్లపల్లి శ్రీనివాస్ సహా 23 మంది ఫారెస్ట్ అధికారులు అశువులు బాసారని చెప్పారు. గంధపు చెక్కలు, ఏనుగు దంతాల స్మగ్లర్ వీరప్పన్‌తో పోరాటం చేసి ప్రాణాలు వదిలిన శ్రీనివాస్ సహా సిబ్బంది త్యాగాలను మనతో పాటు భావి తరాలు మరిచిపోకూడదని అన్నారు. భవిష్యత్ తరాలు గుర్తించుకునేలా విగ్రహాల ఏర్పాటు, నగర వనాలు, అటవీ శాఖ భవనాలకు వారి పేర్లు పెడతామని తెలిపారు. అమరవీరుల కుటుంబాలను ఆదుకోవడానికి తీసుకుచ్చిన సంజీవని పథకానికి పారిశ్రామికవేత్తలు, దాతలతో మాట్లాడి రూ.ఐదు కోట్ల నిధులు సమీకరిస్తామని వెల్లడించారు. అమరవీరుల స్తూపాలను ఏర్పాటు చేస్తామని చెప్పారు.

బిష్ణోయ్ తెగలా పోరాటం చేద్దాం

చెట్లు, వన్య ప్రాణులను కాపాడుకోవడానికి బిష్ణోయ్ తెగ ఎంత వరకైనా వెళ్తుందని, జోద్‌పూర్ రాజు చేపట్టిన చెట్లు నరికివేతకు వ్యతిరేకంగా అమృతా దేవి నాయకత్వంలో బిష్ణోయ్ తెగ శాంతియుతంగా పోరాడి వందల సంఖ్యలో ప్రాణాలను అర్పించిందని గుర్తు చేశారు. రాజు సైన్యంపై ఎదురుదాడి చేయకుండా చెట్లను కౌగలించుకొని సైన్యం చేతిలో వీరమరణం పొందారని తెలిపారు. ఆ కోవకు చెందిన వ్యక్తులే మన అమరవీరులన్నారు. వీరిని స్ఫూర్తిగా తీసుకునే అటవీ సంపద సంరక్షణ కోసం సుందర్ లాల్ బహుగుణ చిప్కో ఉద్యమం చేశారని, అటవీశాఖ నా చేతిలో ఉన్నంత వరకు ప్రజలకు మేలు జరిగేలా సంస్కరణలు తప్పకుండా తీసుకొస్తానని చెప్పారు. కావాల్సిన నిధులు తీసుకొస్తానని పేర్కొన్నారు. ఏలూరు జిల్లా ఐఎస్ జగన్నాథపురం పంచాయతీ పరిధిలో సహజ వనరులు ఇష్టారాజ్యంగా తవ్వేశారని చెప్పారు. ప్రకృతి వనరుల దోపిడీని అరికట్టేందుకు ఇప్పటికే టోల్ ఫ్రీ నంబర్ ఇచ్చామని వివరించారు. స్మగ్లర్ల నుంచి స్వాధీనం చేసుకున్న ఎర్ర చందనాన్ని త్వరలో అంతర్జాతీయ బిడ్డింగ్ ద్వారా వేలం వేయబోతున్నామన్నారు. కార్యక్రమంలో జెడ్పీ చైర్‌పర్సన్ కత్తెర హెనీ క్రిస్టినా, కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి, ఎమ్మెల్యేలు నసీర్ అహ్మద్, మాధవి, రామాంజనేయులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

కస్టమర్ కేర్ ఉద్యోగాలకు శిక్షణ

క్రోసూరు: ఏపీ ఎస్ఎస్‌డీసీ ఆధ్వర్యంలో క్రోసూరు ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో ఉచిత శిక్షణ, ఉద్యోగావకాశాల కోసం ఈ నెల 14వ తేదీ వరకు దరఖాస్తులు ఆహ్వానించనున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ రమాదేవి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. కస్టమర్ కేర్ డొమెస్టిక్ వాయిస్ కోర్సు కోసం రెండు నెలల ఉచిత శిక్షణ కార్యక్రమం నిర్వహించనున్నట్లు చెప్పారు. నియోజకవర్గంలోని 10 పైన చదువుకున్న వారు, 15–45 సంవత్సరాల లోపు వారు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. శిక్షణకు ఆధార్ కార్డు, చదువుకున్న మార్క్స్ మెమో జిరాక్స్ కాపీలు, పాస్‌పోర్టు సైజు ఫొటోలు–2 తీసుకురావాలన్నారు. శిక్షణ పూర్తి అయిన వెంటనే జాబ్ కల్పించబడుతుందన్నారు. వివరాలకు బి.అంజిరెడ్డి 9494986164 నంబర్‌లో సంప్రదించవచ్చునన్నారు.

జాతీయ స్థాయి ఫుట్‌బాల్ పోటీలకు యామిని ఎంపిక


యామిని

సత్తెనపల్లి: ఫుట్‌బాల్ జాతీయ స్థాయి పోటీలకు తలపాల యామిని ఎంపికైంది. విద్యార్థిని పల్నాడు జిల్లా సత్తెనపల్లి మండలం పెదమక్కెన జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 9వ తరగతి చదువుతోంది. స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ గుంటూరు, ప్రగతి జూనియర్ కళాశాల సత్తెనపల్లి ఆధ్వర్యంలో మూడు రోజులుగా నిర్వహించిన 68వ రాష్ట్రస్థాయి ఫుట్‌బాల్ పోటీల్లో గుంటూరు జిల్లా బాలికల జట్టు తృతీయ స్థానంలో నిలిచింది. ఈ జట్టులో ప్రతిభ కనబరిచిన యామినిని జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక చేసినట్లు ఫిజికల్ డైరెక్టర్ అనీల్ దత్త నాయక్ ఆదివారం తెలిపారు. డిసెంబర్‌లో మణిపూర్ రాజధాని ఇంఫాల్‌లో నిర్వహించే జాతీయ స్థాయి ఫుట్‌బాల్ పోటీల్లో ఆంధ్రప్రదేశ్ జట్టు నుంచి యామిని ప్రాతినిధ్యం వహించనుంది. ఈ సందర్భంగా విద్యార్థినిని సత్తెనపల్లి శాసనసభ్యుడు కన్నా లక్ష్మీ నారాయణ అభినందించారు.


బాలికపై లైంగిక దాడి

- ప్రేమ పేరుతో వంచన
- వన్‌టౌన్‌లో బాధితురాలి ఫిర్యాదు

నరసరావుపేటటౌన్: ప్రేమ పేరుతో వంచించి లైగింక దాడికి పాల్పడ్డ యువకుడిపై చర్యలు తీసుకోవాలని బాలిక ఆదివారం వన్‌టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. పోలీసులు తెలిపిన వివరాలు.. రామిరెడ్డిపేట ప్రాంతానికి చెందిన 16 ఏళ్ల బాలికకు మెడికల్ దుకాణంలో పనిచేసే యువకుడు పరిచయం అయ్యాడు. గత కొన్ని నెలలుగా చనువుగా ఉంటూ ప్రేమ పేరుతో బాలికను శారీరకంగా లోబరుచుకున్నాడు. కొన్ని రోజుల క్రితం అతని స్నేహితులతో కలిసి వచ్చి బాలికను దుర్భాషలాడి దాడి చేశాడు. ఈ మేరకు బాధితురాలు వన్‌టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేసింది.

ఆరబెట్టిన పత్తి అగ్నికి ఆహుతి

- లింగారావుపాలెంలో ఘటన
- గుర్తు తెలియని వ్యక్తులు నిప్పు పెట్టారంటూ రైతు ఆరోపణ
- 60 క్వింటాళ్లు ఆరబెట్టగా సగానికిపైగా దహనం అయిందని ఆవేదన


ఆరబెట్టిన పత్తి కాలిపోయిన దృశ్యం

యడ్లపాడు: తెల్లవారితే సీసీఐ కేంద్రంలో పత్తి విక్రయించి అప్పులు తీర్చుకుందామని ఆశ పడ్డాడు రైతు. అందుకు రైతు భరోసా కేంద్రంలో ఈ–క్రాప్ కార్డు తీసుకుని కేంద్రానికి తరలించేందుకు ఆన్‌లైన్ రిజిస్టర్ చేశాడు. అయితే సీసీఐ కేంద్రం అధికారులు పత్తిని ఆరబెట్టి తీసుకురావాలనే నిబంధన పెట్టినందున వచ్చిన దిగుబడి అంతా ఇంటిలోపల, బయట మూడు ప్రాంతాల్లో ఆరబెట్టాడు. ఇంతలోనే ఊహించని విధంగా బయట ఆరబెట్టిన పత్తికి అగ్ని రాజుకుంది. వీధిలోని వారు పరుగున వచ్చిన మంటల్ని అదుపులోకి తెచ్చేలోపే ఆరబెట్టిన 60 క్వింటాళ్లలో సగానికి పైగా కాలిపోయింది. బాధిత రైతు కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలు... యడ్లపాడు మండలం లింగారావుపాలెం గ్రామం పోస్టాఫీస్ బజారులో నివాసం ఉండే రైతు షేక్ అల్లాబక్షు ఈ ఏడాది ఖరీఫ్ సీజన్‌లో తన సొంత భూమితో పాటు మరికొంత కౌలుకు తీసుకుని 35 ఎకరాల్లో పత్తి సాగు చేశాడు. ఈ ఏడాది గులాబీ పురుగు ఉధృతి కారణంగా ఎకరాకు 6 క్వింటాళ్లకు మించి దిగుబడి రాలేదు. ఇటీవల తిమ్మాపురంలో సీసీఐ పత్తి కొనుగోలు కేంద్రం ప్రారంభించడంతో అక్కడి విక్రయించి సాగు నిమిత్తం తను తెచ్చిన అప్పుల్ని తీర్చుకుందామనే ఆశతో వచ్చిన దిగుబడిని మూడు మండేళ్లుగా ఆరబెట్టాడు. గ్రామంలోని తన ఇంట్లో కొంత, వరండాలో, బయట పక్క మరికొంత పత్తిని ఆరబెట్టాడు. అయితే ఆదివారం సాయంత్రం 6.30 గంటల సమయంలో బయట ఆరబెట్టిన పత్తి నుంచి ఒక్కసారిగా మంటలు వచ్చాయి. దీంతో వీధిలోని రైతులు గమనించి బావి నీటిని, తమ ఇళ్లల్లోని నీళ్లను తీసుకువచ్చి మంటల్ని అదుపులోకి తెచ్చారు. బయట వరకు 60 క్వింటాళ్లు ఆరబెట్టగా అందులో 30 క్వింటాళ్లు బూడిదయ్యిందని, మంటల్ని అదుపుచేసే క్రమంలో తడిసిన పత్తి పరిస్థితి ఏంటో అర్థం కావడం లేదని బాధిత రైతు ఆవేదన వ్యక్తం చేస్తున్నాడు. కావాలనే గుర్తు తెలియని వ్యక్తులు నిప్పు పెట్టారంటూ ఆరోపిస్తున్నాడు. పత్తి క్వింటా బహిరంగ మార్కెట్లో రూ.6 వేలు చొప్పున కొనుగోలు చేస్తుండగా, సీసీఐ కేంద్రంలో క్వింటా ధర రూ.7,520 చొప్పున మద్దతు ధర ప్రకటించిన విషయం తెలిసిందే. సగటున క్వింటా ధర రూ.7 వేల చొప్పున చూసినా 30 క్వింటాళ్లపై రూ.2 లక్షల వరకు నష్టం వాటిల్లిందని తెలిపారు. ప్రజా ప్రతినిధులు, అధికారులు తమకు న్యాయం చేయాలని బాధిత రైతు కుటుంబం విజ్ఞప్తి చేసుకుంటున్నారు.

లీగల్ విభాగం పాత్ర ఎంతో కీలకం

- కూటమి కుట్రలు అడ్డుకుందాం
- మాజీ మంత్రి విడదల రజిని


లీగల్ విభాగం సభ్యులతో సమావేశమైన రజిని, పక్కన పోలూరి తదితరులు

పట్నంబజారు: సోషల్ మీడియా యాక్టివిస్టులపై అక్రమ కేసుల కూటమి కుట్రలను అడ్డుకోవాల్సిన బాధ్యత న్యాయవాదులపై ఉందని మాజీ మంత్రి, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ చిలకలూరిపేట నియోజకవర్గ సమన్వయకర్త విడదల రజిని చెప్పారు. శ్యామలానగర్‌లోని తన కార్యాలయంలో ఆదివారం వైఎస్సార్ సీపీ లీగల్ విభాగం సభ్యులతో ఆమె సమావేశమయ్యారు. విడదల రజిని మాట్లాడుతూ... కూటమి నేతలు కక్షపూరితంగా వైఎస్సార్ సీపీ సోషల్ మీడియా సభ్యులను టార్గెట్ చేసి ఒకటికి పది కేసులు నమోదు చేయటం దారుణమన్నారు. ఇటువంటి పరిస్థితుల్లో లీగల్ విభాగం సభ్యుల పాత్ర ఎంతో కీలమన్నారు. చిలకలూరిపేటకు సంబంధించిన పెద్దిరెడ్డి సుధారాణి అంశంలో హెబియస్ కార్పస్ పిటిషన్ దాఖలు చేయటం ద్వారానే ఆమెకు ప్రాణ రక్షణ కల్పించగలిగామన్నారు. న్యాయవాదులు అండగా నిలబడటం ద్వారానే సుధారాణి, వెంకటరెడ్డి దంపతులను కాపాడుకోగలిమని పేర్కొన్నారు. రెడ్‌బుక్ రాజ్యాంగంతో ఏకమై పోలీసులు కూడా వ్యవహరిస్తున్న తీరు ఆక్షేపణీయం అన్నారు. లీగల్ విభాగం సభ్యులు వెంటనే మరింత మంది బాధితుల పక్షాన పోరాడేందుకు సిద్ధంగా ఉండాలన్నారు. పార్టీ లీగల్ విభాగం కోర్ కమిటీ సభ్యులు పోలూరి వెంకటరెడ్డి మాట్లాడుతూ... ప్రస్తుతం పోలీసుల వ్యవహరిస్తున్న తీరు అత్యంత ఘోరంగా ఉందన్నారు. మహిళ అయిన సుధారాణికి జరిగిన అన్యాయంపై మాజీ మంత్రి రజినికి వివరించారు. భర్త వెంకటరెడ్డి ప్రమేయం లేకపోయినా.. అక్రమంగా ఇరికించారని తెలియజేశారు. ఏ ఒక్క ఫిర్యాదులో కూడా వెంకటరెడ్డి పాత్ర లేకపోయినా. ఫిర్యాదుదారుడు కూడా ఏమీ చెప్పకపోయినా అక్రమంగా రిమాండ్ రిపోర్టులో సుధారాణి భర్త పేరు చేర్చినట్లు తెలిపారు. వైఎస్సార్ సీపీ లీగల్ విభాగం జిల్లా అధ్యక్షుడు సీడీ భగవాన్, మొండితోక శ్రీనివాసరావు, రమణారెడ్డి, శ్రీనివాసరెడ్డి, కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వ్యక్తి దారుణ హత్య


బంధువులతో మాట్లాడుతున్న డీఎస్పీ జనార్దనరావు

పొన్నూరు: మండలంలోని ములుకుదురులో వ్యక్తి దారుణ హత్యకు గురైన సంఘటన ఆదివారం జరిగింది. పోలీసుల నుంచి సేకరించిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన నక్కల దేవరాజ్(36) ఎలక్ట్రీషియన్‌గా జీవనం సాగిస్తున్నాడు. శనివారం రాత్రి ఇంటి నుంచి బయటికి వెళ్లిన దేవరాజ్ గ్రామ సమీపంలో హత్యకు గురయ్యాడు. వివాహేతర సంబంధమే దీనికి కారణమని సమాచారం. నిందితులను వెంటనే అరెస్టు చేసి బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని బంధువులు, దళిత సంఘాల నాయకులు బాపట్ల ప్రధాన రహదారిపై ఆందోళన చేశారు. సమాచారం తెలుసుకున్న తెనాలి డీఎస్పీ జనార్దనరావు, రూరల్ సీఐ కోటేశ్వరరావు, రూరల్ ఎస్ఐ కిరణ్‌బాబులు హత్య జరిగిన ప్రదేశాన్ని పరిశీలించి, విచారణ చేపట్టారు.

నేడు ఇద్దరు ఉపాధ్యాయులకు పురస్కార ప్రదానం

గుంటూరు ఎడ్యుకేషన్: డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతి సందర్భంగా సెప్టెంబర్ ఐదో తేదీన జరగాల్సిన ఉపాధ్యాయ దినోత్సవాన్ని సోమవారం విజయవాడ లబ్బీపేటలోని ఏ కన్వెన్షన్ సెంటర్‌లో నిర్వహించనున్నారు. గుంటూరు జిల్లా నుంచి ఎంపికైన రాష్ట్రస్థాయి ఉత్తమ ఉపాధ్యాయులు కార్యక్రమానికి హాజరు కావాలని డీఈవో సీవీ రేణుక ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఎంపికైన పొన్నూరు మండలం మామిళ్లపల్లి ఎంపీయూపీఎస్ స్కూల్ అసిస్టెంట్ గణితశాస్త్ర ఉపాధ్యాయుడు చెన్నంశెట్టి రమేష్, కొల్లిపరలోని ఎంపీపీ స్కూల్ ఎస్జీటీ పెనుమూడి మృత్యుంజయరావులకు డీఈవో అభినందనలు తెలియజేశారు. వీరు సోమవారం ఉదయం 6 గంటలకు ఏ కన్వెన్షన్‌లో రిపోర్టు చేయాలని సూచించారు.

అంబులెన్స్ వెళ్లేలా చర్యలు తీసుకున్నాం

ఏఎస్పీ రమణమూర్తి

నగరంపాలెం: పోలీస్ శాఖ సకాలంలో స్పందించి అంబులెన్స్ వెళ్లేలా చర్యలు తీసుకున్నామని జిల్లా ఏఎస్పీ రమణమూర్తి (పరిపాలన) ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆసుపత్రికి వెళ్తున్న అంబులెన్స్‌కు అరణ్య భవన్ వద్ద ఎటువంటి అడ్డంకులు ఏర్పడలేదని తెలిపారు. వ్యక్తి అనారోగ్య పరిస్థితి దృష్ట్యా అత్యవసరంగా సీపీఆర్ చికిత్స అందించేందుకు వైద్య సిబ్బంది అంబులెన్స్‌ను ఆపారని పేర్కొన్నారు. ఎటువంటి ట్రాఫిక్ అంతరాయం కలగలేదన్నారు. ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ పర్యటన దృష్ట్యా పోలీస్ శాఖ అరణ్య భవన్ ముందు రోడ్డులో ఎటువంటి ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా బందోబస్తు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. వీవీఐపీ, వీఐపీ పర్యటనల్లో అంబులెన్స్, అత్యవసర సేవల వాహనాలకు తప్పనిసరిగా దారి ఇవ్వడం జరుగుతుందని తెలిపారు.

కాంట్రాక్టు లెక్చరర్‌లను క్రమబద్ధీకరించాలి


ఆలయం వద్ద హోమం నిర్వహిస్తున్న దృశ్యం

మంగళగిరి: కాంట్రాక్ట్ లెక్చరర్లను క్రమబద్ధీకరించి, జీవోఎంఎస్ నెంబర్ 114ను వెంటనే అమలు చేయాలని ప్రభుత్వ కాలేజ్ లెక్చరర్ల అసోషియేషన్ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆదివారం పట్టణంలోని శ్రీలక్ష్మీనృసింహస్వామి ఆలయంలో లక్ష్మీగణపతి హోమం నిర్వహించారు. ప్రభుత్వం, అధికారులను తమ విజ్ఞప్తిని పట్టించుకోవడం లేదన్నారు. ఈ నెల 14 నుంచి 19 వ తేదీ వరకు పసుపు రిబ్బన్లతో విధులకు హాజరుకానున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో అసోషియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు బీఎస్ఆర్ శర్మ, పీజే గాంధీ తదితరులు పాల్గొన్నారు.

కుక్కల దాడిలో ఎనిమిది మందికి గాయాలు


ఆసుపత్రిలో బాధిత చిన్నారి

తెనాలి రూరల్: పట్టణంలో వీధి కుక్కలు స్వైర విహారం చేశాయి. కనబడిన వారి మీదల్లా దాడి చేసి తీవ్రంగా గాయపరిచాయి. తెనాలి పట్టణంతోపాటు పరిసర ప్రాంతాల్లో ఆదివారం ఉదయం వీధి కుక్కలు దాడి చేయడంతో ఎనిమిది మంది గాయపడ్డారు. బాధితులు తెనాలి ప్రభుత్వాస్పత్రికి క్యూ కట్టారు. ఇంటి ముందు ఆడుకుంటున్న చిన్నారులతోపాటు పెద్దవాళ్లనూ కుక్కలు కరిచాయి. బాలాజీరావుపేట, యడ్ల లింగయ్య కాలనీ, గంగానమ్మపేట, కఠెవరం, అలాగే బాపట్ల జిల్లా చుండూరు మండలం వలివేరు ప్రాంతాల్లో కుక్కలు ప్రజలను తీవ్రంగా గాయపరిచాయి. బాధితుల్లో గంగానమ్మపేటకు చెందిన పిచ్చియ్య, బాలాజీరావుపేట ప్రాంతానికి చెందిన శ్రీరామకృష్ణ, రాజశేఖర్, పద్మావతి, శివమ్మ, వలివేరుకు చెందిన సామ్రాజ్యం, కఠెవరానికి చెందిన చిన్నారులు షణ్ముఖరావు, టి. ప్రెయిసీలు ఉన్నారు. వీధి కుక్కల్ని పట్టుకోవడంలో పురపాలక సంఘం, పంచాయతీ అధికారులు తీవ్ర నిర్లక్ష్యం వ్యవహరించడం వల్లే తమ ప్రాణాల మీదకు వచ్చిందని బాధితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

కార్పొరేషన్ నిధులతో దళితులకు వసతులు

తాడేపల్లి రూరల్: మాదిగ కార్పొరేషన్ నిధులతో దళితులకు కావాల్సిన మౌలిక సదుపాయాలు కల్పిస్తామని మాదిగ కార్పొరేషన్ చైర్మన్ ఉండవల్లి శ్రీదేవి స్పష్టం చేశారు. ఆదివారం ఎంటీఎంసీ పరిధిలోని తాడేపల్లి బైపాస్‌రోడ్‌లోని మాదిగ కార్పొరేషన్ కార్యాలయంలో ఆమె విలేకరులతో మాట్లాడుతూ ... తనకు అవకాశం కల్పించిన ముఖ్యమంత్రి చంద్రబాబు , డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్ తదితరులకు కృతజ్ఞతలు తెలిపారు. రిజర్వేషన్ల కారణంగానే తాము ఈ స్థితిలో ఉన్నామని చెప్పారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో దళితులకు పథకాలు నిలిపివేశారని ఆరోపించారు. అమరావతి అభివృద్ధి చెందితే దళితులకు ఉద్యోగాలు వస్తాయని పేర్కొన్నారు. దళితులకు ఎన్టీఆర్, చంద్రబాబులు మాత్రమే న్యాయం చేశారని అన్నారు.

కరెంటు చార్జీల భారం ఉపసంహరించుకోవాలి

తాడేపల్లి రూరల్: విద్యుత్తు ట్రూఅప్ చార్జీల పేరుతో రాష్ట్ర ప్రభుత్వం ప్రజలపై భారం వేయడాన్ని ఉపసంహరించుకోవాలని సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు వి.కృష్ణయ్య డిమాండ్ చేశారు. ఆదివారం తాడేపల్లి పట్టణ పరిధిలోని ముగ్గురోడ్డు, పోతురాజుస్వామి గుడి, రన్నింగ్ రూమ్ ప్రాంతాల్లో సీపీఎం ప్రజాపోరు ప్రచార కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్యఅతిథిగా వి. కృష్ణయ్య మాట్లాడుతూ.. తాము అధికారంలోకి వస్తే కరెంటు చార్జీలు పెంచబోమని చెప్పిన కూటమి ప్రభుత్వం ఇప్పుడు రూ.18 వేల కోట్ల భారం మోపుతోందని విమర్శించారు. ఉచిత ఇసుక విధానం అమలులోకి రాలేదని ఆరోపించారు. భవన నిర్మాణ కార్మికులకు పనులు లేకుండా పోయాయని విమర్శించారు. రాష్ట్రంలో మహిళలు, బాలికలపై అత్యాచారాలు జరుగుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. సీపీఎం పట్టణ కార్యదర్శి బూరగ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ఈ నెల 14వ తేదీన తాడేపల్లి తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నాలో ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొనాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు దొంతిరెడ్డి శ్రీనివాసకుమారి, సుబ్బారెడ్డి, దర్శన విజయబాబు, కోట బాబూరావు, రామారావు, తులసీరావు, లీలమ్మ, శ్రీనివాసరావు, బి. అంజిరెడ్డి, ఫిరోజ్, సుభాని, ఆదాం, కొట్టే కరుణాకరరావు, ఎస్. గిరిజ, సీహెచ్ భుజంగరావు, పద్మ, భవాని, ఖాజావలి, బొబ్బిలి రామారావు, సత్యం, జ్యోతి, వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

శ్రీకృష్ణదేవరాయలు పాలన స్ఫూర్తిదాయకం

- కోటప్పకొండ కాపు సత్రంలో శ్రీకృష్ణదేవరాయలు విగ్రహావిష్కరణ
- పాల్గొన్న ఎంపీ లావు, ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ


విగ్రహ ఆవిష్కరణలో పాల్గొన్న ఎంపీ లావు, ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ

నరసరావుపేట రూరల్: శ్రీకృష్ణదేవరాయలు ప్రతి తరానికి స్ఫూర్తిదాయకమని ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు పేర్కొన్నారు. కోటప్పకొండలోని శ్రీకృష్ణదేవరాయ ట్రస్ట్, కాపు అన్నదాన సత్రం రజోత్సవాలు పురస్కరించుకొని సత్రంలో విగ్రహాన్ని ఆదివారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఎంపీ లావు, ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎంపీ లావు మాట్లాడుతూ యుద్ధవీరుడు, పరిపాలన దక్షుడు, సకల కళా వల్లభుడని కొనియాడారు. దేవాలయాల అభివృద్ధిలో శ్రీకృష్ణదేవరాయలు చూపిన శ్రద్ధ ప్రపంచ స్థాయిలో నిలిచిపోయిందన్నారు. తిరుపతి, శ్రీకాళహస్తి పుణ్యక్షేత్రాల అభివృద్ధి రాయల వారి కాలంలోనే జరిగిందని తెలిపారు. గ్రామాల అభివృద్ధిలో ఆయన ప్రత్యేక ముద్ర ఉందని, చెరువులు, కాలువల నిర్మాణంలో చూపిన పనితనం ఇప్పటికీ చెరగనిదని అన్నారు. అటువంటి మహనీయులు, నాయకులు నుంచి చూడాల్సింది కులం, మతం కాదని వారు సాధించిన కీర్తి, పనితీరు అని పేర్కొన్నారు. అదే భావితరాలకు స్ఫూర్తిగా నిలుస్తుందని అన్నారు. ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ మాట్లాడుతూ ప్రజా పరిపాలనలో రారాజుగా శ్రీకృష్ణదేవరాయలు నిలుస్తారని తెలిపారు. దేశ అభివృద్ధి గురించి మాట్లాడాలంటే రాయల వారి కాలం నుంచి పరిపాలన గుర్తు చేసుకోవాలన్నారు.

నాటక రంగంలో ఆంజనేయరాజు ఎనలేని సేవ

- పుట్టంరాజు బుల్లెయ్య, రామలక్ష్మమ్మల పురస్కారం
- వేడుకగా కళాపురస్కార సభ


మిద్దెబోయినను సన్మానిస్తున్న పుట్టంరాజు దంపతులు, సాహితీవేత్తలు

అద్దంకి: మిద్దెబోయిన తన నటనా వైదుష్యంతో అద్దంకి ప్రాంతానికి పేరు ప్రఖ్యాతులు తెచ్చిపెట్టాడని సాహితీవేత్త గాడేపల్లి దివాకర దత్తు అన్నారు. ఆదివారం పట్టణంలోని మారంవారి సేవాసదన్‌లో ప్రముఖ నాటక కళాకారుడు మిద్దెబోయిన ఆంజనేయరాజుకు పుట్టంరాజు బుల్లెయ్య, రామలక్ష్మమ్మల కళా పురస్కారం అందించారు. కార్యక్రమానికి గాడేపల్లి దివాకర దత్తు అధ్యక్షత వహించారు. ఆయన మాట్లాడుతూ పట్టణానికి చెందిన పాత తరానికి చెందిన రంగస్థలం, సినిమాల్లో అద్దంకి శ్రీరామ్మూర్తి మొదలు బండారు రామారావు, పుట్టంరాజు శంకరరావు, అద్దంకి మాణిక్యాలరావు గొప్ప పేరు తెచ్చుకున్నారన్నారు. నుంచి నేటి ఆంజనేయరాజు కూడా వారి వరుసలో చేరాడన్నారు. తమ నటనతో అద్దంకి ప్రాంతానికి ఖ్యాతిని తెచ్చిన విషయాన్ని ప్రశంసించారు. జానపద, పురాణ పాత్రల్లో అద్భుతంగా నటించి రంగస్థల రంగానికి ఎనలేని ఖ్యాతి తెచ్చిన వారిలో ఆంజనేయరాజు ఒకరని పేర్కొన్నారు. పురస్కార ప్రదాత పుట్టంరాజు శ్రీరామచంద్రమూర్తి మాట్లాడుతూ కళే దైవంగా, జీవనోపాధిగా బతుకు వెళ్లదీసిన నటులను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు గుర్తించి కళాకారుల పెన్షన్ మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు.

కళలను బతికించుకోవాలి..

సినిమా, బుల్లితెరల ఆవిర్భావం వల్ల కళాకారుల జీవన పరిస్థితులు అధ్వానంగా మారాయని, మన సంస్కృతి, సంప్రదాయాలను ప్రతిబింబించే కళలను బతికించుకోవాల్సిన బాధ్యత నేటి సమాజంపై ఉందని డీవీఎం సత్యనారాయణ పేర్కొన్నారు. పండగలు, తిరునాళ్లు, జాతర్లలో నాటక ప్రదర్శనలు తగ్గిపోవడం వల్ల రంగస్థల కళాకారులు కూలిపనులకు వెళుతున్నారని వారణాసి రఘురామశర్మ ఆవేదన వ్యక్తం చేశారు. ఒకప్పుడు బండ్లు కట్టుకుని వచ్చి తెల్లవార్లు డ్రామాలు చూసే రోజులు ఉండేవి, ఇప్పుడు అలాంటి రోజుల మళ్లీ రావాలంటే సమాజం తన బాధ్యతని గుర్తించుకోవాలని డాక్టర్ యూ దేవపాలన అన్నారు. ఈ సందర్భంగా పలువురు వక్తలు మిద్దెబోయిన వారి కళారంగ సేవలను సభకు పరిచయం చేశారు. అనంతరం పురస్కార గ్రహీత ఆంజనేయరాజుకు పుట్టంరాజుబుల్లెయ్య రామలక్ష్మమ్మల కళాపురస్కార నగదు రూ.5 వేలు, పట్టు వస్త్రాలు, జ్ఞాపికలను పుట్టంరాజు శ్రీరామచంద్రమూర్తి, శైలజ అందించి ఘనంగా సత్కరించారు. సన్మాన కార్యక్రమానికి లక్కరాజు శ్రీనివాసరావు అధ్యక్షత వహించారు. పురస్కార గ్రహీత ఆంజనేయరాజు మాట్లాడుతూ ట్రస్టు పక్షాన ఆంధ్రప్రదేశ్‌లోని మహామహులైన కళాకారులను సత్కరిస్తున్నారు. అదేకోవలో తనను కూడా గుర్తించి పురస్కారం అందించినందుకు కతజ్ఞతలను తెలియచేశారు. కార్యక్రమంలో చప్పిడివీరయ్య, చుండూరి మురళీసుధాకర రావు, మల్లాది శ్రీనివాసరావు," కోటయ్య, తన్నీరు నాగేశ్వరరావు, రాఘవరావు, అడుసుమల్లి అనంత కోటేశ్వరరావు, కంఠంరాజు శివరామ కోటేశ్వరరావు, ఆకుల చినయోగయ్య, షేక్ మస్తాన్, మారం రామకోటేశ్వరరావు, నిమ్మరాజు నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా కర్రసాము పోటీలు


విజేతలతో తులసి రామచంద్రప్రభు తదితరులు

గుంటూరు ఎడ్యుకేషన్: పట్టాభిపురంలోని టీజేపీఎస్ కళాశాలలో ఆదివారం సౌత్ ఇండియా స్థాయిలో సిలంబం పోటీలను టీజేపీఎస్ కళాశాల కరస్పాండెంట్ కేవీ బ్రహ్మం ప్రారంభించారు. ఈ సందర్భంగా పోటీల నిర్వహణకు రూ.2.50 లక్షలను తులసి సీడ్స్ యాజమాన్యం సమకూర్చింది. పోటీలు ఆద్యంతం ఉత్సాహంగా జరిగాయి. విజేతలకు ముఖ్య అతిథి తులసి రామచంద్ర ప్రభు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కార్యక్రమ నిర్వహణను విజయవంతంగా పూర్తి చేశామని తెలిపారు. కర్రసాము కోచ్ వర్మ, గ్రాండ్ మాస్టర్ జిడుగు సుబ్బారావులను అభినందించారు. తనకు కర్రసాము వచ్చని, ఇది కనుమరుగు కాకూడదనే కార్యక్రమ ఏర్పాటుకు సహకారం అందించామన్నారు. ఆంధ్ర, తెలంగాణ, కేరళ, తమిళనాడు నుంచి 300 మంది క్రీడాకారులు పాల్గొన్నారు. ఉగ్గిరాల సీతారామయ్య, దళవాయి సుబ్రహ్మణ్యం, సిద్ధార్థ వర్మ, సుధీర్, సుమంత్, ఆర్ఆర్ఆర్ శర్మ, క్రీడాకారుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

విజయనగర శాసనం లభ్యం


శాసనాన్ని పరిశీలిస్తున్న శివనాగిరెడ్డి

మొగల్రాజపురం(విజయవాడ తూర్పు): ఎంతో చారిత్రక ప్రాధాన్యం ఉన్న క్రీస్తు శకం 15వ శతాబ్దానికి చెందిన విజయనగర శాసనాన్ని పరిరక్షించి భద్రపరచాలని పురావస్తు పరిశోధకుడు, ది కల్చరల్ సెంటర్ ఆఫ్ విజయవాడ అండ్ అమరావతి (సీసీవీఏ), ప్లీచ్ ఇండియా ఫౌండేషన్ సంస్థ సీఈఓ డాక్టర్ ఈమని శివనాగిరెడ్డి ప్రభుత్వాన్ని కోరారు. ఎన్టీఆర్ జిల్లా విజయవాడ మధుచౌక్‌లోని సీసీవీఏ కార్యాలయం ఆవరణలో శివనాగిరెడ్డి ఆదివారం విలేకరులతో మాట్లాడారు. బాపట్ల జిల్లాలో ఆదివారం పర్యటించామని చెప్పారు. మార్టూరు పట్టణంలోని పాత శివాలయం ముందు ఉన్న మురుగు కాలువలో క్రీస్తు శకం 15వ శతాబ్దానికి చెందిన శాసనం ఉందన్నారు. క్రీస్తు శకం 1453లో విజయనగర చక్రవర్తి మల్లికార్జున రాయలు స్థానిక సోమనాథ దేవాలయ నిర్వహణకు చేసిన సహాయ వివరాలతోపాటుగా ఆ గ్రామ చరిత్రకు సంబంధించిన విషయాలు ఈ శాసనంలో ఉన్నాయని చెప్పారు. శాసనాన్ని పాత శివాలయం ఆవరణలో భద్రపరచడంతోపాటుగా ఆ వివరాలను ప్రజలకు తెలిసేలా ప్రత్యేకంగా బోర్డులు ఏర్పాటు చేయాలని కోరారు. మణిమేల శివశంకర్, భాగవతం వెంకట నారాయణాచార్యులు, కందుకూరి చరణ్, గుత్తి నాగవంశీ, శరత్ తనకు సహకరించారన్నారు.

హోరాహోరీగా బేస్‌బాల్ పోటీలు

ప్రత్తిపాడు: ప్రత్తిపాడు మండలం యనమదల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఏపీ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో రాష్ట్ర స్థాయి 68వ ఏపీ ఎస్‌జీఎఫ్ ఇంటర్ డిస్ట్రిక్ట్ బేస్‌బాల్ టోర్నమెంట్ కం సెలక్షన్లు ఉత్సాహంగా సాగుతున్నాయి. రెండవ రోజైన ఆదివారం అండర్–17 బాలుర, బాలికల విభాగాల్లో పోటీలు హోరాహోరీగా జరిగాయి. 13 జిల్లాల నుంచి 26 జట్లు తలపడ్డాయి. పోటీల తర్వాత క్రీడాకారులతో క్యాంప్‌ఫైర్ నిర్వహించారు. సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. పాఠశాల హెచ్ఎం ఎం. నాగేశ్వరరావు, ఎస్ఎంసీ చైర్మన్ చౌదరిబాబు, రోటరీ క్లబ్ ఆఫ్ గుంటూరు సెంటినియల్ సుబ్రమణ్యం, ఎస్‌జీఎఫ్ మాజీ సెక్రటరీలు మస్తాన్‌రెడ్డి, సీనియర్ క్రీడాకారులు జగదీశ్వర్‌రెడ్డి పోటీలను పర్యవేక్షించారు.

విజేతలు వీరే...

విజేతల వివరాలను పోటీల అబ్జర్వర్ శ్రీకాంత్ రెడ్డి, ఆర్గనైజింగ్ సెక్రటరీ బి. గంగాధరరావులు సంయుక్తంగా ప్రకటించారు.

బాలికల విభాగంలో..

అనంతపురం జిల్లా జట్టుపై ప్రకాశం జిల్లా జట్టు 0–10 తేడాతో గెలిచింది. కడపపై గుంటూరు 0–5 తేడాతో, చిత్తూరుపై శ్రీకాకుళం 0–6, విజయనగరంపై కర్నూలు 1–3 తేడాతో విజయం సాధించాయి.

బాలుర విభాగంలో..

గుంటూరుపై 5–6 తేడాతో విజయనగరం, కృష్ణాపై ప్రకాశం 1–6 తేడాతో, విశాఖపట్నంపై కర్నూలు 2–4 తేడాతో, కడపపై శ్రీకాకుళం 4–5 తేడాతో విజయం సాధించాయి.